1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
సోమవారం | 10 జూన్ 2024 | www.navatelangana.com

ప్రశాంతంగా గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష

6705 మంది అభ్యర్థుల హాజరు

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, పోలీస్ కమిషనర్

నవ తెలంగాణ-సిద్దిపేట



గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. సిద్దిపేట పట్టణంలో ఏర్పాటుచేసిన 21 పరీక్ష కేంద్రాలలో 8,223 మంది అభ్యర్థులకుగాను 6705 మంది విద్యార్థులు హాజరయ్యారు. 1518 మంది విద్యార్థులు గైరాజరయ్యారు. మిట్టపల్లి గురుకుల పాఠశాల వద్ద 16 మంది పరీక్షా సమయానికి ఆలస్యంగా రావడంతో వారిని పరీక్షకు అధికారులు అనుమతించలేదు. జిల్లా కలెక్టర్ మను చౌదరి, పోలీస్ కమిషనర్ అనురాధ, అడిషనల్ కలెక్టర్, పరీక్షల నిర్వహణ అధికారి గరిమ అగ్రవాల్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పరీక్ష సెంటర్ల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును పరిశీలించారు. పరీక్షా సెంటర్ల నిర్వాహకులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండడం మూలంగా కేంద్రల వద్ద నిర్మానుష్య వాతావరణ కనిపించింది.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ -ములుగు



పల్సర్ బైక్‌పై అతివేగంతో వచ్చి డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన ములుగు గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై జరిగింది. ఎస్ఐ జయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా కోడిమియాల మండలం రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన భూషమైన నాంపల్లి (32) రాత్రి ఒంటి గంటకు కరీంనగర్ నుంచి హైదరాబాద్‌లోని తన బంధువుల ఇంటికి పల్సర్ బైక్‌పై బయల్దేరాడు. ములుగు గ్రామ శివారులో మార్గమధ్యలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్దకు చేరుకోగానే 3.20 గంటల సమయంలో పల్సర్ బైక్ బైకు అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతనికి బలంగా గాయాలు కావడంతో గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

ఆయిల్ ఫామ్ రైతులను

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి



మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు

నవతెలంగాణ-నంగునూరు

ఆయిల్ ఫామ్ రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు కోరారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామంలో ఆయిల్ ఫామ్ మొట్ట మొదటి క్రాఫ్ కటింగ్ కార్యక్రమంలో మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామ ఆదర్శ రైతు తిప్పని నాగేందర్ మొదటి మొక్క నాతో నాటించారని ఇప్పుడు పంట కోత నా చేతుల మీదుగా చేస్తున్నానని, ఇది తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. పంట పండినందుకు రైతుకు ఎంత ఆనందంగా ఉంటుందో ఈ పంటను ఇక్కడ పరిచయం చేసిన ప్రజా ప్రతినిధిగా నాకు అంతే సంతోషం ఉందన్నారు. జూన్ 2021లో నంగునూరు మండలం రామచంద్రాపురం మదిర గ్రామంలో ఈ పంటను మొదటి సారి వేయడం జరిగిందన్నారు. అలా మూడేళ్ల క్రితం ఆయిల్ ఫామ్ సాగు ప్రారంభించామన్నారు. ఎల్లారెడ్డి పొలంలో మొదటి ఆయిల్ ఫామ్ మొక్క నాటామని తిప్పని నాగేందర్ తోటలో మొదటి పంట కోసుకుంటున్నామని తెలిపారు. ఆయిల్ ఫామ్ పంట అంటే చాల మంది రైతుల్లో అనుమానాలు ఉండేవని, ఖమ్మంతో సహా ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు ఎన్నో లాభాలు పొందుతున్నారన్నారు. మన రాష్ట్రంలో కూడా రైతులు లాభం పొందాలని ఇక్కడ ప్రారంభం చేశామన్నారు. ఆయిల్ ఫామ్ ప్రకృతి ప్రసాదించిన వరమని రైతులు ఎదగడానికి దోహదపడుతుందన్నారు. ఇది చాలా సులువైన పంట అని స్థిరమైన ఆదాయమని ఏడాది అంతా లాభమేనన్నారు. కమ్మ కొట్టు, గెల కొట్టు, చెక్కు తెచ్చుకో అన్నట్టు ఉంటుందన్నారు. ఎకరాకు లక్షా 20 వేల ఆదాయం వరకు ఉంటుందన్నారు. ఆరుగాలం శ్రమించే రైతన్నకు లాభం చేయాలని మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు కోసం ప్రోత్సాహం అందించారన్నారు. పంటకు డ్రిప్‌తో పాటు, ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీ అందించారని తెలిపారు. ఆ చర్యల ఫలితమే తెలంగాణ ఆయిల్ ఫామ్ సాగులో అత్యధిక వృద్ధి సాధించిందన్నారు. దళారి వ్యవస్థ లేదు. ధర రాదు అనే బాధ లేదని ఆయిల్ ఫెడ్ ద్వారా నేరుగా ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. సిద్దిపేట జిల్లాలోని నంగునూరు మండలం నర్మెట గ్రామంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ 300 కోట్లతో 120 టన్నుల క్రషింగ్ సామర్థ్యంతో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు జరుగుతున్నదని, దేశంలోనే అతిపెద్ద ఫ్యాక్టరి మనకు రావడం సంతోషకరంగా ఉందన్నారు. ఫ్యాక్టరీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. ఏప్రిల్ 25 నాటికి ప్రారంభించే లక్ష్యంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

క్రూడ్ పామ్ ఆయిల్ తీయడంతో పాటు శుద్ధి చేసే విధానం, ప్యాకింగ్ ఉంటుందని ఆటో పవర్ జనరేషన్ కూడా ఉంటుందన్నారు. సున్నా లిక్విడ్ డిశ్చార్జ్‌తో ఈ ఫ్యాక్టరీ ఉంటుందన్నారు. సిద్దిపేట జిల్లానే కాకుండా, జనగాం, మహబూబాబాద్, గద్వాల్, నారాయణపేట, భువనగిరి ఆయిల్ ఫామ్ పంటలకు ఇది కేంద్రంగా ఉంటుందని చెప్పారు. మూడు ఆయిల్ ఫామ్ నర్సరీలు పెట్టి, మొక్కలు కూడా అందిస్తున్నామని రైతులు ముందుకు రావాలని ఇది మంచి ఆదాయం అందిస్తుందని ప్రభుత్వ ఉద్యోగులకు జీతం వచ్చినట్లు రైతుల అకౌంట్లో డబ్బులు పడతాయన్నారు. 11,268 ఎకరాల్లో సాగుతో మన జిల్లా, ఖమ్మం తరవాత మనమే ఈ స్థానంలో ఉన్నామని స్పష్టం చేశారు. ఆయిల్ ఫామ్ బీజం వేసింది ఇక్కడేనని ఫ్యాక్టరీ ఇక్కడే రావడం సంతోషంగా ఉందన్నారు. ఆయిల్ ఫామ్ సాగులో సిద్దిపేట ఆదర్శంగా నిలిచిందని, కోనసీమగా ఈ ప్రాంతం మారుతుందని చెప్పవచ్చాన్నారు. మన దేశంలో 40శాతం మాత్రమే ఉత్పత్తి, 60 శాతం దిగుమతి చేసుకుంటున్నామన్నారు. ఆయిల్ ఫామ్‌కు సిద్దిపేట హబ్ అవుతుందన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం కూడా ఆయిల్ ఫామ్ పంటను ప్రోత్సహించాలని కోరారు. అంతర్ పంటగా వేసే కోకో ధర బాగా పెరిగిందని ఇది కూడా రైతులకు ఎంతో లాభమన్నారు. సిద్దిపేట జిల్లా రైతులకు కోకో కొనుగోలు చేసేందుకు కేంద్రం తెచ్చేలా హెర్షురి చాక్లెట్ కంపెనీని కోరటం జరిగిందన్నారు.

వారిని త్వరలో తీసుకు వచ్చి కోకో మొక్కలు కూడా ఇప్పిస్తామని తెలియజేశారు. అంతర్ పంటలకు అవసరమైన మెలకువలు, సహాయం వారు అందిస్తారని చెప్పారు. ఎంతో కష్టపడి కాళేశ్వరం ద్వారా నీళ్ళు తెచ్చాం, కరెంటు ఇచ్చాం, మంచి పంటలు పండాలని రైతులకు లాభం జరగాలి అన్నది మా కోరికన్నారు. పామ్ ఆయిల్ దిగుబడి మీద కష్టం డ్యూటీ గతంలో 15-43 శాతం ఉండేదని ఈ డ్యూటీ తొలగించడం వల్ల విదేశాల నుండి ఇబ్బడి ముబ్బడిగా ఆయిల్ ఫామ్ దిగుమతి అవుతుందన్నారు. దీంతో ఇక్కడి రైతులు నష్ట పోతున్నారని మన దేశ ఆయిల్ ఫామ్ రైతులకు లాభం జరగాలంటే, దిగుమతిపై డ్యూటీ వేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వేలేటి రాధా కృష్ణ శర్మ, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆనగోని లింగం గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, సొసైటి చైర్మన్లు కోల రమేశ్ గౌడ్ ఎల్లంకి మహిపాల్ రెడ్డి, రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు బద్దిపడగ కిష్టారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిప్పని నాగేందర్, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు గోవిందారం రవి, వివిధ గ్రామాల తాజా మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వర్గ పోరాటాలతోనే ప్రజాస్వామ్యం మనుగడ

- మార్క్సిజంతోనే సమసమాజం సాధ్యం
- సీపీఐ(ఎం) శిక్షణా తరగతుల్లో జిల్లా కార్యదర్శి జయరాజు

నవతెలంగాణ-సంగారెడ్డి

దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి ఒక్క కమ్యూని స్టుల ద్వారానే సాధ్యమవుతుందని.. వర్గ పోరాటాలతోనే ప్రజాస్వామ్యానికి మనుగడ ఉంటుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి.జయరాజు అన్నారు. పార్టీ సంగారెడ్డి మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కేవల్ కిషన్ భవన్‌లో ఆదివారం రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సంద ర్భంగా జయరాజు మాట్లాడుతూ.. 50-60 ఏండ్ల కాలంలో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలే కేంద్రంలో అధికారంలో ఉన్నాయి"ని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలే మూడుసార్లు బీజేపీ ప్రభు త్వం ఏర్పడటానికి అవకాశం కల్పించాయన్నారు. భారతదేశంలో రాజకీయ, ఆర్థిక పరమైన విచ్ఛిన్నం జరగడం వల్లే దేశం ప్రగతి పథంలో ముందుకు సాగలేక పోతుందన్నారు. బీజేపీ పాలనలో అల్లరి మూకల చేష్టలు పెచ్చరిల్లుతున్నా యని ఆందోళన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులు రాజకీయ ంగా ఎదిగిన దేశాల్లో ప్రగతి, జీడీపీ, ఆర్థిక వ్యవస్థలు బలో పేతమై ప్రపంచ దేశాలకు దిక్సూచిగా మారినట్టు గత చరిత్ర లు చెబుతున్నాయన్నారు. దేశంలో పదేండ్లుగా మోడీ ప్రభు త్వంలో కుల, మత పరమైన అంశాలను ప్రజల్లో జొప్పించి.. ఘర్షణలు, అరాచకాలు, అమానవీయ చర్యలను ప్రోత్సహిం చారని ఆరోపించారు. లౌకికవాదాన్ని దెబ్బతీసేలా, ప్రజా స్వామ్య వ్యవస్థను కుప్పకూల్చేలా చేసిందన్నారు. ఇది ప్రజా స్వామ్యానికి చేటు చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ కార్మిక చట్టాల ను మారుస్తూ తీరని నష్టం చేసిందన్నారు. వర్గ పోరాటాల ద్వారానే ప్రజాస్వామ్యం మనుగడ సాధ్యమవుతుందని, అందుకు కమ్యూనిస్టు వాదులంతా కంకణబద్ధులు కావాల న్నారు. అనేక సమస్యలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయని, వాటి పరిష్కారం కోసం బీజేపీ ప్రభుత్వం చేసింది ఏమీలే దని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు, సంపన్నులకు పన్నుల్లో రాయితీలు ఇవ్వడానికి తప్పా దేశ ప్రగతికి, ప్రజల కోసం మోడీ చేసింది



శూన్యమన్నారు.కార్యక్రమంలో యాద"గిరి, శ్రీనివాస్ గౌడ్, నరేష్, మల్లేశం, శోభ, రమాదేవి, మనీ, మంజుల, శ్రీనివాస్,రాజు,మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సువర్ణ లక్ష్మిని పరామర్శించిన హరీశ్ రావు



నవ తెలంగాణ-సిద్దిపేట

పట్టణ పరిధిలోని 37వ వార్డులో బిఆర్ఎస్ నాయకురాలు సువర్ణ లక్ష్మి అనారోగ్యానికి గురికాగా ఆమెను ఎమ్మెల్యే హరీష్ రావు ఆదివారం వారి నివాస గృహానికి వెళ్లి పరామర్శించారు. ఆమె ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, నర్సింగ్ కౌన్సిల్ మాజీ సభ్యులు పాల సాయిరామ్, మున్సిపల్ కౌన్సిలర్ భూంపల్లి శ్రీహరి, 37వ వార్డు పార్టీ సభ్యులు సామల్ల సాయిప్రేమ్, సామల్ల గణేష్, బత్తుల ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో నాలుగు గేదెలు మృత్యువాత

రూ.3 లక్షల నష్టం

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం!

నవతెలంగాణ-పుల్కల్

వేలాడుతున్న కరెంటు తీగలకు తాకడంతో విద్యు ద్ఘాతానికి గురై నాలుగు గేదెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన చౌటాకూర్ మండల పరిధిలోని గంగోజిపేట గ్రామంలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగోజిపేట గ్రామానికి చెందిన మంగలి మహా నంద్, మహమ్మద్ షఫీలు రోజులాగానే గేదెలను మేత కోసం వరి పొలాల్లోకి తోలుకెళ్లారు. అయితే అక్కడ కరెంటు తీగలు కిందికి వేలాడుతుండగా.. మేత మేసుకుంటూ వెళ్లిన గేదెలు ఆ వైర్లకు తగలడంతో విద్యుద్ఘాతానికై గురై అక్కడి కక్కడే నాలుగు మృత్యువాత పడ్డాయి. వాటి విలువ సుమా రు మూడు లక్షల వరకు ఉంటుందని బాధితులు వాపో యారు. వాటి మృత్యువాతతో జీవనోపాధి లేకుండా పోయిం దని ఆవేదన వ్యక్తం చేశారు. వైర్లు వేలాడుతున్నాయని పలు మార్లు విద్యుత్ అధికారులు చెప్పినప్పటికీ పట్టించుకో లేదని.. వారి నిర్లక్ష్యం వల్లే గేదెలు మృత్యువాత పడ్డాయని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. తమను ప్రభుత్వ మే ఆదుకోవాలని కోరారు. ఇప్పటికైనా విద్యుతాధికారులు స్పందించి..కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని గ్రామస్తులు కోరారు.



ప్రమాదవశాత్తు నీట మునిగి వ్యక్తి మృతి

నవతెలంగాణ-వర్గల్

ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన మండలంలోని నాచారం హల్దీ వాగు వద్ద జరిగింది. పోలీసులు, మృతుడి కుటుంబసభ్యులు, తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చెల్ మండలం కోనాయపల్లి గ్రామానికి చెందిన రాజేష్ (25) ఆదివారం వారి బంధువులతో నాచారంకి వచ్చారు. నాచారంలోని నాచారం లక్ష్మి నరసింహస్వామి దేవాలయం సమీపంలోని హల్దీ వాగులో రాజేష్ తన బంధువులతో స్నానం చేయడానికి హల్దీ వాగులోకి వెళ్ళాడు. వాగులో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడు. మృతుడి భార్య తేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గౌరారం ఎస్సై శివకుమార్ తెలిపారు. ....

అపరిశుభ్రంగా మురికి కాలువలు



- అవస్థలు పడుతున్న కాలనీవాసులు

నవ తెలంగాణ-మిరుదొడ్డి

మురికి కాలువలు శుభ్రం చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దుబ్బాక నియోజకవర్గంలోని మిరుదొడ్డి మండల కేంద్రంలోని ఆరో వార్డులో మురికి కాలువలు శుభ్రం లేక ఈగలు దోమలతో పాటు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు తెలిపారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడంతో ప్రజలు అనారోగ్యాల భారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కాలనీల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని మండిపడ్డారు. అధికారులు ఎప్పుడు కూడా కాలనీలను సందర్శించడం లేదని మండిపడ్డారు. పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం మూలంగా గ్రామంలో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆరోపించారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక అధికారులకు తెలియజేసినప్పటికీ ఎవరు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో మురికి కాలువలు శుభ్రం చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-చేర్యాల

వారంతా చిన్ననాటి స్నేహితులు ఒకేచోట చదువుకున్నారు. పదో తరగతి పూర్తయ్యాక కొంతమంది ఉద్యోగాల్లో స్థిరపడగా, మరికొంత మంది వ్యాపారం, ఇతర రంగాల్లో, విదేశాలలో సెటిల్ అయ్యారు. వారే చేర్యాల పట్టణ కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరి బాలుర పాఠశాలలో 1997-98 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు. పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తు చేసుకున్నారు. సుమారు 63 మంది పూర్వ విద్యార్థులందరూ ఒకేచోట చేరవడంతో సందడి వాతావరణం నెలకొంది. నాటి రోజుల్లో తరగతి గదిలో జరిగిన మధుర జ్ఞాపకాల గురించి సరదాగా మాట్లాడుకున్నారు. అందరరూ కలిసి తమ తమ సెల్ఫోన్లలో ఫోటోలు తీసుకున్నారు. దాదాపు 25 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. నాడు పాఠశాలలో గడిపిన మధుర స్మృతులను, జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని సంతోషంగా గడిపారు. ఒకరి నొకరు శాలువా జ్ఞాపికాలతో సన్మానం చేసుకున్నారు. అనంతరం సరదాగా ఆడి పాడారు. డాన్స్‌లతో హెూరెత్తించారు.

నవతెలంగాణ
సంగారెడ్డి
2
సోమవారం | 10 జూన్ 2024 | www.navatelangana.com

బండి సంజయ్‌ను సన్మానించిన వేణుమాధవ్



నవతెలంగాణ-సంగారెడ్డి

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను ఢిల్లీలోని ఆయన నివాసం వద్ద బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు నెమలికొండ వేణుమాధవ్ శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ కేంద్ర మంత్రివర్గంలో తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో కష్టపడ్డ పనిచేసే వారికి తగిన గుర్తింపు బీజేపీలోనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మనోహర్ రెడ్డి, గిరిధర్, శిరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటా మహాసభల్లో మంత్రితో కలిసి పాల్గొన్న గిరిధర్‌రెడ్డి



నవతెలంగాణ-జహీరాబాద్

అమెరికాలోని ఆటా కన్వెన్షన్‌లో మూడ్రోజులు జరిగిన 18వ (ఆటా) తెలుగు మహాసభల్లో తెలంగాణ రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలిసి తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ యన్.గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. ప్రతీయేడు జరిగే ఆటా మహాసభల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి ముఖ్యమంత్రి, మంత్రులు పాల్గొనే ఆనవాయితీ ఉన్నది. అక్కడ జరిగే మహాసభల్లో రాష్ట్రంలో జరుగుతున్న పాలన, శాంతిభద్రతల గురించి వివరించి పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణం గురించి వివరిస్తారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ సీనియర్ నాయకులు డా సిద్దం.ఉజ్వల్ రెడ్డి, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మెన్‌లు తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లో రాయితీ సోయా విత్తనాల విక్రయం



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పరిధి పట్టణంలోని ఇప్పపల్లి సహకార బ్యాంక్ పక్కలో గల డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రంలో సోయా విత్తనాలు కేడిఎస్-726 వెరైటీ నేషనల్ సీడ్స్ విక్రయించనున్నట్టు ఉమ్మడి మెదక్ జిల్లా సహకార మార్కెటింగ్ చైర్మెన్, సినీ నిర్మాత మల్కాపురం శివకుమార్ తెలిపారు. 25 కిలోల బస్తా అసలు ధర రూ.2,750 ఉండగా.. రాయితీతో రూ.2000కే ఇక్కడ లభ్యమవుతుంన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సర్టిఫైడ్ చేసిన విత్తనాలను డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లో రాయితీ ధరతో కొని లబ్ధి పొందాలని రైతులకు సూచించారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.



సీఐ రవి చిన్నారులను ఆశీర్వదించిన నాయకులు

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ సీఐ రవి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ నాయకులు జావీద్, ఇనాయత్, వివిధ పార్టీల నాయకులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సురక్షిత ప్రయాణాలకు డ్రైవర్లదే బాధ్యత.

నవతెలంగాణ-న్యాల్‌కల్

ప్రయాణీకులను వారి గమ్యస్థానాలకు చేర్చే వరకు.. సురక్షిత ప్రయాణాలకు డ్రైవర్లదే బాధ్యత అని హద్నూర్ ఎస్ఐ రామునాయుడు అన్నారు. 'మై ఆటో సేఫ్' కార్యక్రమంలో భాగంగా హద్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల 92 ఆటోలకు ఆదివారం క్యూఆర్ కోడ్ స్కానర్ స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. స్కానర్ కోడ్ రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ స్కానర్ ద్వారా ఆటో డ్రైవర్ ఫోన్ నెంబర్, పేరు, వివరాలు తెల్సుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు సుధాకర్, ఆటో డ్రైవర్లు రేజింతల్ మునీర్, మ్యరుజాపూర్ ఫహిమ్, జైపాల్, డ్రైవర్లు ఉన్నారు.



ప్రయివేటు వద్దు.. ప్రభుత్వ పాఠశాలలే ముద్దు

నవతెలంగాణ-గుమ్మడిదల

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామ వీధుల గుండా తిరుగుతూ.. 'ప్రయివేటు వద్దు.. ప్రభుత్వ పాఠశాలలే ముద్దు' అంటూ ప్రజలకు అవగాహన కలిపస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వమే పాఠ్యపుస్తకాలు, స్కూల్‌డ్రెస్, మధ్యాహ్న భోజనం తదితర సదుపాయాలను ఉచితంగా కల్పిస్తున్నదన్నారు. నిరుపేద కుటుంబాల విద్యార్థులు ఎందరో ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని.. విద్యార్థుల తల్లిదండ్రుల్లో చైతన్యం కల్పిస్తున్నారు.



శ్రీ కల్కి అమ్మా భగవాన్ కళ్యాణ వేడుకలు

నవతెలంగాణ-సంగారెడ్డి

సమాజ మార్పు కోసం ఆధ్యాత్మిక సేవాకార్యక్రమాలు ఎంతో వవసరమని శ్రీ పద్మిని దామోదర రాజా నరసింహ అన్నారు. శ్రీ పరం జ్యోతి అమ్మబగవన్ సేవాసమితి సంగారెడ్డి ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శ్రీ కల్కి అమ్మా భగవాన్ కళ్యాణ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండల నుండి కాక హైద్రాబాద్, రంగారెడ్డి తదితర ప్రాంతాలనుండి భక్తులంతా అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.అనంతరం సేవాసమితి నిర్వాహకులు న్యాయవాది కాలివేముల సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రతి ఏటా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నిర్మల జగ్గారెడ్డి , కొన సంతోష్ కుమార్ కౌన్సిలర్, అనిల్ కొండలరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సురేష్ షేట్కార్‌కే టీపీసీసీ ఇవ్వాలి



నవతెలంగాణ-కల్హేర్

కాంగ్రెస్ పార్టీకి నమ్మకస్తుడు, సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్‌కే టీపీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని సీనియర్ నాయకులు దేవదాస్ పార్టీ అధిష్టానాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో వైయస్ రాజశేఖరొడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డిలు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి ఎమ్మెల్యేగా, ఎంపీగా వారితో కలిసి పనిచేసిన సుదీర్ఘ రాజకీయ అనుభవం సురేష్ కుమార్ సెట్కార్‌కు ఉన్నదన్నారు. మంచికి మారుపేరైన ఆయనకే టీపీసిసి అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరారు.

కొండెక్కిన కోడి ధర

- కోడిగుడ్ల ధరలు కూడా..
- ఎండల తీవ్రతకు అమాంతం పెరిగన రేట్లు

నవతెలంగాణ-జహీరాబాద్

ఎండల ప్రభావంతో చికెన్ ధరలు అమాంతం పెరిగాయి. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల పౌల్ట్రీ పరిశ్రమల్లో కోళ్ళ ఉత్పత్తి తగ్గిపోవడంతో పాటు ఫామ్‌లో ఉన్న కోళ్లు ఎండ తాకిడికి మృత్యువాత పడుతున్నాయి. దాంతో చికెన్ ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. గత నెల రోజుల క్రితం ఉన్న ధరలకు.. ఇప్పటి ధరలకు సుమారు వంద రూపాయలకు పైనే ధరలు పెరగడం గమనార్హం. రెండు మూడు రోజుల నుంచి వాతావరణం చల్లబడినప్పటికీ.. ధరల్లో మాత్రం మార్పు లేదు.

నెల రోజుల క్రితం లైవ్ కోడి కిలో రూ.150 నుంచి రూ.175 ఉండగా ప్రస్తుతం రూ.325 పలుకుతుంది. ప్రాసెసింగ్ చికెన్ 200 నుంచి నేడు 325 నుంచి 50 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. అనుకున్న స్థాయిలో కోళ్ల ఉత్పత్తి జరగకపోవడంతో పాటు ఫామ్‌లో ఉన్న కోళ్ళు, చిన్నపిల్లలు ఎండ తాకిడికి చనిపోతున్నందువల్లనే చికెన్ ధర రోజురోజుకు పెరిగిపోతుందని వ్యాపారస్తులు చెబుతు న్నారు. రూ.4.50 పైసలు ఉన్న గుడ్డు ధర.. గుడ్లను పెట్టే కోళ్ల చనిపోవడంతో ఏకంగా ఆరు రూపాయలకు పెరిగింది. ఒక ట్రై గుడ్లు రూపాయలు 180కి చేరింది. దాంతో సామాన్య ప్రజలపై ఈ పెరిగిన ధరలు ఆర్థిక భారంగా మా రాయి. వారం రోజులు కూలి పనులకు వెళ్లిన పేద ప్రజలు.. ఆదివారం రోజున మాంసంతో కడుపు నింపుకోవా లనుకుంటే.. ఈ పెరిగిన ధరలకు మళ్లీ చింత పులుసే చారే దిక్కు అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సామాన్య ప్రజల జరుపుకునే ఫంక్షన్లు, శుభాకార్యాలపై కూడా పెరిగిన ధరలు ప్రభావం చూపిస్తున్నాయి.



బిర్యానీ ధరలు కూడా పెరిగే..

చికెన్, గుడ్డు ధరలు పెరగడంతో హెూటళ్లలో బిర్యాని ధరలను కూడా హెూటల్ నిర్వాహకులు పెంచేశారు. దాంతో మధ్యతరగతి కుటుంబాల వివాహ విందు వేడుకల్లో చికెన్ బిర్యానీలు వండేందుకు వెనుకడుగు వేయడంతో పాటు కూరగాయల పలావులను తయారుచేయాల్సిన దుస్థితి నెలకొన్నది. ప్రధానంగా ప్రస్తుతం గిరిజనులు, మైనార్టీల కుటుంబాల్లో వివాహాలు ఎక్కువగా ఉండడంతో వారు లబోదిబో అంటున్నారు.



ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-రామచంద్రాపురం

పటాన్చెరువులోని సరస్వతి శిశుమందిర్లో చదివిన 2001-2002 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం రామచంద్రాపురం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆచార్యులు దామోదర్ రెడ్డి, ఉపాధ్యాయులు స్వరూపరాణి, మంగమ్మ, వరలక్ష్మి పరమేశ్వరి శ్రీధర్ రెడ్డి, పూర్వ విద్యార్థులు రామానంద్ గౌడ్. బాలకృష్ణ సంతోషి లావణ్య శీను మురళి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పళ్ళు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రశాంతగా ముగిసిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

- జిల్లా వ్యాప్తంగా 9672 మంది అభ్యర్థులకు గాను 7,530 మంది హాజరు, 2142 మంది గైర్హాజర్
- అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు
- పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన



నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ముగిసిందని అదనపు ఎస్పీ ఏ.సంజీవరావు అన్నారు. సంగారెడ్డిలో పలు పరీక్ష కేంద్రాలను ఆయన స్వయంగా సందర్శించారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేయించడంతో పాటు, పోలీసు సిబ్బందితో బయోమెట్రిక్ విధానం ద్వారా అటెండెన్స్ తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 16 పరీక్షా కేంద్రాల్లో 9672 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 7,530 మంది అభ్యర్థులు హాజరుకాగా 2142 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు అన్నారు.

మాతృత్వాన్ని చాటిన మహిళా పోలీసు సిబ్బంది..



సంగారెడ్డిలోని కరుణ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో ఓ తల్లి పరీక్ష రాయడానికి వెళ్లగా చిన్నారి గుక్కపట్టి ఏడ్చింది. దాంతో ఆ చిన్నారిని ఎత్తుకొని లాలిస్తూ మహిళా పోలీసు సిబ్బంది మాతృత్వాన్ని చాటుకున్నారు.

కాలనీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం



నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కాలనీల అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తూ, ప్రగతి పథంలో ముందుకు వెళుతున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని ఎస్ఆర్ఐ ఆనంద్‌నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన కాలనీ సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీ న్పూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామన్నారు. సంక్షేమ సంఘం భవనానికి సంపూర్ణ సహకారం అందించిన మున్సిపల్ వైస్ చైర్మెన్ నందారం నరసింహగౌడ్‌ను అభినందించారు. అనంతరం.. బీరంగూడలోని గోశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ నరసింహ గౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్స్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలువురికి నీలం మధు పరామర్శ



నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని పారిశ్రామిక పంచాయతీ గ్రామమైన గడ్డపోతారానికి చెందిన బాలుగారి శ్రీనివాస్ పెద్ద కూతురు అనారోగ్యంతో ఇటీవలే మృతి చెందింది. ఈ విషయిం తెల్సుకున్న మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ నీలం మధు ముదిరాజ్ ఆదివారం బాధిత కుటుంబాన్ని ప్రత్యేకంగా పరామర్శించారు. అలాగే ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు నారబోయిన నర్సింగరావు బైక్ పైనుంచి పడి గాయాలతో బాధపడుతుండగా.. వారి కుటుంబాన్ని కలిసి ఓదార్చారు. ఈ సందర్భంగా ఏ కుటుంబానికి చిన్న కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని నీలం మధు ముదిరాజ్ భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్ రెడ్డి, గడ్డపోతారం మాజీ సర్పంచ్ ఎంపీ అశోక్, మల్లేశం, నారబోయిన శ్రీనివాస్, వావిలాల పీఏసీఎస్ మాజీ చైర్మెన్ ఎంపీ మాణిక్యరావు, నాయకులు వినోద్ రమేష్ స్థానిక నేతలు పాల్గొన్నారు.

43 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట బాలుర ఉన్నత పాఠశాల 1980 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 43 ఏళ్ల తర్వాత సమ్మేళనం కార్యక్రమం ఏర్పాటు చేసి.. 35 మంది విద్యార్థులు ఒకచోట చేరి ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. జోగిపేటలో చదువుకున్న వారందరూ ఆయా ప్రాంతాల నుంచి ఆదివారం సంగారెడ్డిలోని ఫంక్షన్‌హాల్‌లో కలుసుకున్నారు. 43 ఏళ్ల తర్వాత స్నేహితులందరూ మాట్లాడుకొని ఒక వేదికను ఏర్పాటు చేసుకున్నారు. స్నేహితుల ఒకరికొకరు పూర్వపరాలు తెలుసుకొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. మిత్రులందరు తమ పరిచయాన్ని చేసుకోవడం వారి కుటుంబ, వ్యాపార ఉద్యోగ, చేస్తున్న వృత్తి విషయాలు, తమ పిల్లలు వారి చదువులు, ఉద్యోగాలు, వివాహాలు మొదలైన విషయాలన్నీ ఆత్మీయులైన అందరితో పంచుకోవడం, జోగిపేట హైస్కూల్ లో చదువుకున్నప్పటి తీపి జ్ఞాపకాలను పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. స్నేహం 1980 గ్రూపు ద్వారా భవిష్యత్తులో చేపట్టాల్సిన సామాజిక సేవా కార్యక్రమాలు, ఇతర అంశాల గురించి సమావేశంలో చర్చించారు. అందరూ ముక్తకంఠంతో ఏకాభిప్రాయంగా ముందుగా చదువుకున్న పాఠశాలకు సేవ చేద్దామని, విద్యార్థులకు కావాల్సిన స్కూల్ బ్యాగులు లేదా పాఠశాలకు కావాల్సిన ఇతర అవసరాలను తీర్చడానికి తీర్మానించారు. మిత్రులందరు ఒకే చోట భోజనం చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందని పలువురు తెలిపారు. ఈ కార్యక్రమంలో 1980 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మాణయ్య, రంగ మురళీ, ప్రభాత్ కుమార్, ఆంజనేయులు, కరుణాకర్, సప్తగిరి శేఖర్, రవీందర్, శ్రీధర్, ప్రభాకర్‌రెడ్డి, కాశ శ్రీధర్, జనార్ధన్, లక్ష్మణాచారి పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా దేశెట్టి పాటిల్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జహీరాబాద్

జేకే చారిటబుల్ ట్రస్ట్ అధినేత, గుంజటి ఎంపీటీసీ బొమ్మ దేశెట్టి పాటిల్ జన్మదిన వేడుకలను శనివారం రాత్రి జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జన్మదిన వేడుకల్లో భాగంగా సర్వమత ప్రార్థనలు అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం జర్నలిస్ట్ సంఘం టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పబ్బతి సంతోష్ కుమార్ గుప్త, నియోజకవర్గ యూనియన్ అధ్యక్షుడు సయ్యద్ మహబూబ్ అలీలు పూలమాల శాలువతో ఆయన్ను ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. దేశెట్టి పాటిల్ విద్యాభివృద్ధి కోసం చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమన్నారు. నిరుపేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు వివిధ రకాల సామాగ్రి పంపిణీ చేయడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. జర్నలిస్టులు, ఆయన అభిమానులు జగన్ యాదవ్, తయ్యబ్ అలీ, అబ్దుల్లా సిద్దిఖీ, అబ్దుల్ కరిం, గజమాలతో సన్మానించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాస్టర్ అనిల్ కుమార్, నాయిమోద్దీన్ మొల్సాబ్, శ్రీనివాస్ పూజారి, సయ్యద్ మహబూబ్ అలీ, పబ్బతి సంతోష్ కుమార్ గుప్త, తయ్యబ్ అలీ, జగన్ యాదవ్, అబ్దుల్ కరిం, అబ్దుల్లా సిద్దిఖీ, పబ్బతి రాకేష్ గుప్త, రవికాంత్ గోపన్‌పల్లి, శ్రీకర్ మడివల్, అరుణ్, ప్రభాకర్ పట్లూర్ గుంజేటి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-సంగారెడ్డి

స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ(ఎస్‌టీయూ) 78వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎస్‌టీయూ భవన్ సంగారెడ్డిలో సంఘం పతాకాన్ని జిల్లా అధ్యక్షులు సయ్యద్ సాబేర్ అలీ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సాబేర్ అలీ, శ్రీనివాస్ రాథోడ్ లు మాట్లాడుతూ.. నాటి నిజాం నిరంకుశ వైఖరిపై తుపాకీ గొట్టాలకు ఎదురొడ్డి, ఉద్యమ తిరుగుబాటు జెండా ఎగురవేసిన కామ్రేడ్ మగ్దూం మొహియుద్దీన్ అచంచల కార్యదీక్షా పటిమతో సరిగ్గా 9.6.1947న అంటే మన దేశ స్వాతంత్ర్యానికి పూర్వమే ఉపా ధ్యాయుల హక్కుల కోసం ఆవిర్భవించిన సంఘం రాష్ట్రోపాధ్యాయ సంఘం అని అన్నారు. కామ్రేడ్ మగ్దూం మొహియుద్దీన్,కామ్రేడ్ వీణా విజయ రామ రాజు, కామ్రేడ్ వీపీ రాఘవాచారి, కామ్రేడ్ కత్తి నరసింహారెడ్డి వంటి ఉద్యమ కొదమసింహాలను శాశనమండలి సభ్యులుగా చట్టసభలకు అందించిన ఘనత ఎస్‌టీయూకే దక్కిందన్నారు. ఎస్‌టీయూ మద్దతిచ్చి తెలంగాణ ముద్దుబిడ్డ కాళోజీ నారాయణరావుని శాసన మండలికి పంపిందన్నారు. ఆవిర్భవించిన నాటి నుండి నేటి వరకు ఏ ప్రభుత్వానికి అంటకాగక ఉపాధ్యాయ పక్షపాతిగా భవిష్యత్తులో కూడా ఉపాధ్యాయుల పక్షాన నిలబడుతుందన్నారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ కుమార్ ,జిల్లా ఆర్థిక కార్యదర్శి రమణ కుమార్, సంగారెడ్డి మండలాధ్యక్షులు అంజద్ అలీ, సదాశివపేట ప్రధాన కార్యదర్శి నరసింహరాజు, నాయకులు ఎన్ కే షా అలీ, మునిపల్లి అధ్యక్షులు ఖయ్యూం, పటాన్చెరు ప్రధాన కార్యదర్శి అలీమ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రహ్మాన్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య శ్రీ'లో నగదు ప్యాకేజీ పెంపుపై హర్షం



నవతెలంగాణ-జహీరాబాద్

రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద యాంజియోగ్రామ్, పార్కిన్ సన్, వెన్నుముక వంటి ఖరీదైన వ్యాధులకు చికిత్స, ప్రస్తుతం అమల్లో ఉన్న ఆరోగ్యశ్రీ పథకంలోని చికిత్సల ప్యాకేజీ ధరలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొగి మల్లికార్జున్ హర్షం వ్యక్తం చేశారు. వాటికి సంబంధించి రూ.497.29 కోట్లు అవసరం కాగా శనివారం ఈ నిధులను విడుదల చేస్తూ డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేయడంతో.. పేద ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకుందన్నారు.2007లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు నాణ్యమైన వైద్యము అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టిందని.. ఈ పథకం కింద 2.84 కోట్ల లబ్ధిదారులు ఉన్నారన్నారు. వారికి రూ.10 లక్షల వరకు ఆర్థిక సాయం ఈ పథకం ద్వారా అందుతున్నదన్నారు. రాష్ట్రంలో 1402 ఆసుపత్రుల ద్వారా 1672 చికిత్సా విధానాలు ఈ పథకంలో అందుబాటులో ఉన్నాయన్నారు. అందులో 1375 విధానాలకు ప్యాకేజీ ధరలు పెంచాలని వైద్య నిపుణుల సూచనల మేరకు డిప్యూటీ సీఎం నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇప్పటివరకు ఆరోగ్యశ్రీలో అమలులో లేని యాంజియోగ్రామ్, పార్కిన్ సన్, వెన్నుపూసకు సంబంధించిన 65 అధునాతన చికిత్స విధానాలను ఇకనుంచి ఆరోగ్యశ్రీలో అమలు చేయాలని నిర్ణయించడం హర్షించదగ్గ పరిణామమన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైద్యశాఖ మంత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఎం.సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ కార్యాలయంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్ యూ) జిల్లా కమిటీ సమావేశాన్ని జిల్లా ఉపాధ్యక్షులు సందీప్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం. సురేష్, నరసింహారెడ్డిలు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రయివేటు పాఠశాలలు విచ్చలవిడిగా ఫీజులను వసూలు చేస్తున్నాయన్నారు. ప్రయివేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, టై, బెల్ట్ పేరుతో బేరసారాలు చేయొద్దని.. వాటాని విక్రయించొద్దని ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసినప్పటికీ.. ఆ నిబంధనలను తుంగలో తొక్కి జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలలు విచ్చలవిడిగా పాఠ్యపుస్తకాలు అమ్ముకుంటున్నాయని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, సబ్జెక్టులకు సరిపడా టీచర్లను సకాలంలో కేటాయించాలని, పాఠ్యపుస్తకాలను డ్రెస్సులను సకాలంలో అందజేయాలన్నారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు సంసిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జిల్లా సహాయ కార్యదర్శి గంజి హర్షిత్, జిల్లా నాయకులు అర్జున్ ,శ్రీనిధి, అర్చన, ఆనంద్, నవీన, రమేష్, ప్రియ, ప్రవీణ్ పాల్గొన్నారు.

నాసిరకంగా పనులు.. పగులు పడుతున్న రోడ్లు



నవతెలంగాణ-న్యాల్‌కల్

అధికారుల పర్యవేక్షణా లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో బీటీ రోడ్లను నాసిరకంగా వేయడంతో.. పనులు పూర్తైన కొన్నేండ్లకే రోడ్లు పగుళ్ల పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రామతీర్థం, శంశోల్లాపూర్, వడ్డీ గ్రామాలకు వెళ్లే బీటి రోడ్లు దుస్థితే అందుకు నిదర్శమని మండిపడుతున్నారు. కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంతో పనులను నాసిరకంగా చేపట్టడంతో.. పగుళ్లు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా మారుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి వేసిన రోడ్లు..కొన్నాళ్లకే బీటలు పడుతుండడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని కోరుతున్నారు.

నవతెలంగాణ 3

సిద్దిపేట

సోమవారం | 10 జూన్ 2024 | www.navatelangana.com

సబ్బుబిళ్ళ మీద రామోజీరావు చిత్రం



- అక్షర యోధునికి ఘననివాళి అర్పించిన రామకోటి సంస్థ

నవతెలంగాణ-గజ్వేల్

అక్షర యోధుడు రామోజీరావు చిత్రాన్ని సబ్బుబిళ్ళ మీద అద్భుతంగా చిత్రించి ఘన నివాళులు అర్పించారు గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం. వ్యవస్థాపక, అధ్యక్షులు, రాష్ట్రస్థాయి కళారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు సబ్బుబిళ్లపై రామోజీరావు చిత్రాన్ని చిత్రీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రింది స్థాయి నుంచి ఉన్నత శిఖరాలకు ఎదిగి, అక్షరాన్ని ఆయుధంగా మలిచి, సమాజ శ్రేయస్సుకు నిరంతరం పరితపించిన వ్యక్తి రామోజీరావు అన్నారు. ప్రజల పక్షాన నిలిచి సేవే లక్ష్యంగా ఆపన్న హస్తం కోసం ఎదురుచూసిన వారికి అండగా నిలిచాడన్నాడు. ప్రతి రంగంలో తనదైన ముద్ర వేసిన గొప్పవ్యక్తి రామోజీరావు అన్నారు.

నేను సైతం సమాజ సేవకై



నవతెలంగాణ-గజ్వేల్

నేను సైతం సమాజ సేవకై ముందుకు వెళ్తానని సమాజానికి సేవ చేద్దాం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సర్దార్ పంజాల వెంకట్ గౌడ్ అన్నారు. ఆదివారం హైదరాబాదుకు చెందిన సత్తమ్మ (65) వెన్నుపూస ఆపరేషన్ ఉన్నట్లు ఓ ఫ్లస్ రక్తం కావాలని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ విషయాన్ని తెలుసుకొని నేను సైతం నుంచి సమాజానికి సేవ చేద్దామని ఉద్దేశంతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. ఇందులో బాగంగానే వృద్ధురాలికి రక్తదానం చేయడం జరిగిందన్నారు. హైదరాబాద్‌కి వెళ్లి రక్తదానం చేసినట్లు ఆయన చెప్పారు. అంతేకాకుండా ట్రస్టు ద్వారా పేదలకు ఉచిత భోజనం కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు.

నేడు ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

- జిల్లా కలెక్టర్ మను చౌదరిలి



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఈ నెల 10వ తేది నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసినందున ఈ నెల 10 వ తేదీ సోమవారం నాడు సమీకృత జిల్లా కార్యాలయాల సమాదాయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వివిధ సమస్యల పరిష్కారం కోసం అర్జీలను స్వీకరించడం జరుగుతుందని జిల్లాలోని ప్రజలు ఈ అవకాశం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

తైక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్



నవతెలంగాణ-సిద్దిపేట

ఐఎంఏ హాల్‌లో సిద్దిపేట జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో తైక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్‌లో 40 మంది విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు జిల్లా తైక్వాండో కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులకు బెల్టులు, ధ్రువీకరణ పత్రాలను ముఖ్య అతిథులు జిల్లా తైక్వాండో గౌరవ అధ్యక్షులు వేలేటీ రాధాకృష్ణ శర్మ తైక్వాండో జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ పి.రామ్మోహన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ శర్మ మాట్లాడుతూ తైక్వాండో నేర్చుకోవడం వల్ల మానసిక ఒత్తిడి నుండి విముక్తి లభిస్తుందని, శారీరక ధృఢత్వం ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. డాక్టర్ రామ్మోహన్ మాట్లాడుతూ తైక్వాండో నేర్చుకోవడం ద్వారా క్రమశిక్షణ, ఆరోగ్యవంతమైన జీవితం లభిస్తుందన్నారు. విద్యా ఉద్యోగాలలో 2 శాతం స్పోర్ట్స్ కోటా లభిస్తుందన్నారు.

ఉన్నత పాఠశాల విద్యార్థినిలతో సీఎం ముఖాముఖి



నవతెలంగాణ-నంగునూరు

రాష్ట్రవ్యాప్తంగా పదోతరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించిన 229 మంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ రవీందర్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులకు అభినందన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. రాష్ట్రంలో అత్యధికంగా మొదటి స్థానంలో చిన్నకోడూరు జిల్లా పరిషత్ పాఠశాల, ద్వితీయ స్థానంలో నర్మెట ఉన్నత పాఠశాల, తృతీయ స్థానంలో నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అత్యధిక 10 జిపిఏలు సాధించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం హరిహర కళాభవనంలో సీఎం ఎ.రేవంత్ రెడ్డి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. అందులో భాగంగా నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తేజస్విని, సొప్పరి హారిక, గరిపల్లి వైష్ణవి, కృషిత, కుదురు శ్రీ హర్ష, అక్షయలు సీఎం రేవంత్ రెడ్డితో ముఖాముఖి ఉంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రామస్వామి గౌడ్ తెలిపారు.

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



నవతెలంగాణ-చేర్యాల

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు అందె అశోక్, అంబటి అంజయ్య గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చేర్యాల మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఉద్యమకారులను ఏనాడు పట్టించుకోలేదన్నారు. కేసీఆర్ నియంత అరాచక పాలనకు చరమగీతం పాడి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని తీసుకురావడంలో తెలంగాణ ఉద్యమకారులు కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక మంది పోరాటం చేసి అక్రమ కేసులు జైలు నిర్బంధాలు సైతం లెక్క చేయకుండా పోరాడి ఉద్యమంలో తీవ్రంగా నష్టపోయి కేసుల పాలై పేదరికంలో మగ్గుతున్నారని, ఉద్యమ కారులను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విదంగా 250 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు, నెలకు రూ.25వేల పెన్షన్ అమలు చేయాలని, ప్రతీ ఉద్యమ కారునికి ఉచిత వైద్యం, బస్ పాస్, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఉద్యమకారులు ఎండీ. జహురుద్దీన్, అంబటి నర్సయ్య, తౌట రమేష్, బండారి సిద్దయ్య, దూడం అంజయ్య, లక్ష్మయ్య, చింతల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటికి సై అంటున్న నాయకులు

- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు పోటికి సిద్ధం



నవతెలంగాణ -గజ్వేల్

అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ఆరు నెలల లోపే పార్లమెంట్ ఎన్నికలు వచ్చి ముగిసి పోయాయి. దీంతో రెండు ఎన్నికల్లో కష్టపడిన కార్యకర్తలు, నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారు. ఫిబ్రవరి మొదటి వారంలోనే సర్పంచి పదవి ముగిసి ప్రత్యేక అధికారుల పాలనను తీసుకొచ్చింది. మరో నెలలో జెడ్పీటీసీ, ఎంపీపీ పాలకవర్గాల గడువు కూడా ముగుస్తుంది. గ్రామీణ ప్రాంతాలకు నిధులు కావాలంటే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం నిధులు స్థానిక సంస్థలకు తదితర ఫైనాన్స్ నిధుల కోసం పాలకవర్గం ఉండి తీర్మానాలు చేసి పంపితేనే నిధులు మంజూరు చేస్తారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమైతే కేంద్రం నిధులు గ్రామీణ ప్రాంతాలకు రాకుండా పోతాయి. అదేవిధంగా పార్లమెంటులో బీజేపీ, కాంగ్రెస్ సమాన పార్లమెంట్ స్థానాలు సాధించడంతో వచ్చే అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సైతం ఓటింగ్ శాతం పెంచుకునేందుకు పోటీలో ఉండే అవకాశం ఉంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వంలో జరిపిన సర్పంచ్ ఎన్నికల్లో ఎక్కువ శాతం బీఆర్ఎస్‌కు సంబంధించిన మద్దతుదారులు గ్రామాల్లో ఉండటంవల్ల తిరిగి వారిని ఇంకొంత కాలం కొనసాగిస్తే తలకుమించిన సమస్యలు వస్తాయని భావించిన కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచుల పదవి కాలంతోనే ముగింపు చెప్పాలని భావించి, ఆయా పంచాయతీ కార్యదర్శులకు పూర్తి బాధ్యత ఇచ్చింది. అదేవిధంగా ఎన్నికలు జరపాలంటే గత ప్రభుత్వం రిజర్వేషన్లు వారికి అనుకూలంగా చేసుకున్నారని ఆరోపణలు విమర్శలు వస్తున్న నేపథ్యంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం కుల గణన చేపట్టి తమ పార్టీకి అనుకూలమైన వ్యక్తులకు పదవులు కట్టబెట్టేందుకు సిద్ధమవుతుంది. అందుకే కుల గణన తెరపైకి వచ్చిందని చెప్పాలి. ఇందులో బాగానే గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 175 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో 150 వరకు అప్పటి అధికార పార్టీ సర్పంచులు ఉండటం వల్ల కుల గణన నిర్వహిస్తే గ్రామాల్లో తమ నాయకులకు కార్యకర్తలకు సర్పంచ్ పదవులను, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పదవులు కట్టబెట్టుకోవచ్చని భావిస్తున్న తరుణంలో ప్రభుత్వం కూడా ఆ దిశగా అడుగులు వేస్తుంది. కుల గణనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెరపైకి తీసుకొచ్చి కుల గణన చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. దీంతో గజ్వేల్ నియోజకవర్గ నాయకులు సంబరపడుతున్నారు. దీంతో గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి కలిసి వస్తుందని స్థానిక నాయకత్వం భావిస్తుంది. గజ్వేల్ నియోజకవర్గంలో 9 మండలాల్లో 175 సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులను రిజర్వేషన్ల ప్రకారం రంగంలో దించి ఎక్కువ శాతం గెలిచినందుకు ఇప్పటి నుండే ప్రయత్నాలు చేస్తుంది. రిజర్వేషన్లపై కూడా రాజకీయ ఒత్తిడి ఉండవచ్చని అందరూ భావిస్తున్నారు. రిజర్వేషన్లు మార్పు చేర్పుల చేయవలసిన అవసరం ఉందని స్థానిక నాయకత్వం పార్టీ అధిష్టానాన్ని ప్రభుత్వాన్ని కోరుతుంది. గజ్వేల్ నియోజకవర్గంలో 8 మండలాల్లో ఎంపీపీలు, జడ్పీటీసీలు గత అధికార పార్టీకి చెందిన వారు ఉండటంతో ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనుకున్న స్థాయిలో ఓట్లు సాధించలేకపోయింది. దీంతో రిజర్వేషన్ల మార్పు చేర్పులు కోరుతుంది. సర్పంచుల స్థానాలు కూడా ఎక్కువ శాతం బీఆర్ఎస్ పార్టీ నాయకులే ఉండటమే కాంగ్రెస్‌కు ఓట్లు రాలేదని గజ్వేల్ నేతలు భావిస్తున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకొని రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టాలని స్థానిక నాయకత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అన్ని ప్రాంతాల నుంచి ఈ ఒత్తిడి రావడం వల్ల రిజర్వేషన్లు మార్పు చేయాలంటే కుల గణన నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. గజ్వేల్ మండలం జెడ్పిటిసి ఎంపీపీ స్థానాలు ఎస్సీలకు 10 సంవత్సరాలు కేటయించారు. ప్రస్తుతం ఐదు సంవత్సరాలు పూర్తికాగా మరో ఐదు సంవత్సరాలు ఇదే రిజర్వేషన్లు కొనసాగితే కాంగ్రెస్ పార్టీకి చెందిన మండల నాయకులు ఇతర సామాజిక వర్గాలు రాజకీయంగా నష్టపోతారని భావిస్తున్నారు. తూప్రాన్, మనోహరాబాద్, జగదేపూర్, వర్గల్, ములుగు, కొండపాక తదితర మండలాల్లో రిజర్వేషన్ల మార్పు కూడా అవసరం ఉంటుందని అక్కడ కూడా బీసీ, ఓసీలు, ఎస్సీల రిజర్వేషన్లు ఉన్నాయి. అంతట మార్పు జరగాలని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకత్వం గట్టిగా కోరుకుంటుంది. గత 10 సంవత్సరాలుగా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలను నాయకులను కాపాడుకోవాలంటే ఏదైనా ఒక పదవి అప్పగించాలని ఇక్కడి నాయకత్వం భావిస్తుంది. చాలా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు ఇప్పటికీ పదవి యోగం రాలేదని చెప్పాలి. త్వరలో జరగనున్న సర్పంచి, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో ఛాన్స్ కొట్టేయాలని ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ ప్రకారం పదవుల కోసం ఆశ పడుతున్న వారికి స్థానాలు దొరికే అవకాశం లేదు. మార్పులు చేర్పులు అవుతూనే రాజకీయ భవిష్యత్తు ఉంటుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డిపై నియోజకవర్గంలోని ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్లు ఒత్తిడి తీసుకొస్తున్నారు. నియోజకవర్గంలో 90% ప్రజాప్రతినిధులు అప్పటి అధికార పార్టీ చెందినవారు కావడం వల్ల తమకు ఓట్ల శాతం పెరగలేదని నాయకులు కార్యకర్తలు చెప్పుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలంటే రిజర్వేషన్లు మార్పులు చేర్పులు ఎంతో అవసరం ఉందని క్షేత్రస్థాయిలో తమ పార్టీ మద్దతుదారులు ప్రజాప్రతినిధులుగా ఉంటే ఎలాంటి ప్రోటోకాల్ సమస్య రాదని స్థానిక నాయకత్వం భావిస్తుంది. ప్రస్తుతం రిజర్వేషన్ కొనసాగితే కాంగ్రెస్ పార్టీకి తక్కువ స్థానాలు దక్కే అవకాశాలు ఉన్నాయని పార్టీ సీనియర్ నాయకులు అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం రావడంతో పాటు పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎనిమిది పార్లమెంట్ స్థానాల్లో కైవాసం చేసుకుంది. బీజేపీ సైతం మరో ఎనిమిది పార్లమెంట్ స్థానాలను కైవాసం చేసుకోవడంతో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సైతం పెద్ద ఎత్తున పోటీలో ఉండే అవకాశం ఉంది. స్థానిక నాయకుల్లో నూతన ఉత్సవం వచ్చింది. పదవులు వచ్చే అవకాశం ఉందని అందరూ భావిస్తున్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి ఫలితం దక్కె అవకాశం ఉందని స్థానిక కార్యకర్తలు, నాయకులు అంటున్నారు. ఏది ఏమైనా గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు మాత్రం కుల గణన జరిగి రిజర్వేషన్లు మార్పు వస్తే తమ రాజకీయ భవిష్యత్తు ఉంటుందని అందరూ ఆశిస్తున్నారు.

యన్‌సీసీ సంయుక్త శిక్షణా శిబిరం ముగింపు




నవతెలంగాణ-గజ్వేల్

గత పది రోజులుగా గజ్వేల్ బాలుర విద్యా సముదాయంలో విజయవంతంగా నిర్వహించబడుతున్న యన్‌సీసీ సంయుక్త శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమాన్ని క్యాంప్ కమ్మడాంట్ లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్ రావు నిర్వహించారు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో మొదటగా ఈ పది రోజుల శిబిరంలో కేడేట్‌లకు అందజేసిన శిక్షణను శిబిర నివేదికను క్యాంప్ డిప్యూటీ కమ్మడాంట్ కెప్టెన్ డాక్టర్ భవాని అందజేశారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ పార్థ సారథి నందా వారి భార్య అయిన ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ చిన్మయి దత్తతో హాజరు కావడం జరిగింది. తదనంతరం ముఖ్య అతిథి అయిన ప్రొఫెసర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ యన్‌సీసీ విద్యార్థుల భవిష్యత్తుకి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శిబిర శిక్షణ వలన క్రమశిక్షణ నాయకత్వ లక్షణాలు అలవడుతాయని తెలియ జేశారు. తదుపరి సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం, క్రీడా విజేతలకు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన, ఉత్తమ సేవలందించిన కేడేట్‌లకు మెడల్స్‌ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో చివరి భాగంగా కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ పీయస్ నందా మాట్లాడుతూ ఈ క్యాంప్ నిర్వహించడానికి వసతి కల్పించిన జిల్లా కలెక్టర్‌కి, సంక్షేమ అధికారులకి, మెడికల్ సిబ్బందికి, మున్సిపల్ సిబ్బందికి, మీడియా మిత్రులకి కృతజ్ఞతలు తెలిపారు.

పద్మశాలి సంఘం ఎన్నికలకు సిద్ధం కండి

- ముగిసిన దుర్గాప్రసాద్ పదవీకాలం



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటుకు సిద్ధం చేసుకోవాలని ఆ సంఘం అధ్యక్షులు తలకొక్కుల దుర్గాప్రసాద్ అన్నారు. పద్మశాలి సంఘం పదవి కాలం రెండు సంవత్సరాలు పూర్తి కావడంతో ఆదివారం పద్మశాలి సంఘంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కమిటీని ఎన్నుకునేందుకు కమిటీని వేశామని ఆయన చెప్పారు. ఈ కమిటీ ద్వారా ఎన్నికలు లేదా, ఏకగ్రీవంగా జరిపేందుకు వీలుంటుందన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పద్మశాలి సంఘం ఎన్నికలు నిర్వహించాలని 8 మంది సభ్యులతో ఎన్నికల కమిటీ వేసినట్లు ఆయన చెప్పారు. ఎన్నికలు నిర్వహించడమా ఏకగ్రీవంగా ఎన్నుకోవడమా అనేది కమిటీ నిర్ణయిస్తుందన్నారు. అయితే సంఘం పదవి కాలం రెండు సంవత్సరాలు మాత్రమే ఉండేదని దీనిని మూడు సంవత్సరాల కాలపరిమితికి పెంచుతున్నామన్నారు. ఎన్నికల కమిటీ త్వరలో ఎన్నికల తేదీని నిర్ణయించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో గత కార్యవర్గము జమ ఖర్చులు సభ్యులకు తెలిపినట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి రాష్ట్ర ఉపాధ్యక్షులు తలకొక్కుల రాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, గౌరవ అధ్యక్షులు స్వర్గం రాజేశం, ఉపాధ్యక్షు లు తుమ్మ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కాముని మురళి, కోశాధికారి సురలింగం, కార్యదర్శి గుండు లక్ష్మణ్, పద్మశాలి మాజీ అధ్యక్షులు గాడి పల్లి శ్రీనివాస్, పద్మశాలి కుల పెద్దలు ఆడేపు బాల్ చంద్రం, యూత్ అధ్యక్షు లు ప్రేమ్ కుమార్, సంఘ పెద్దలు యువజన నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత

- సమాజాభివృద్ధి గురువుల చేతుల్లోనే ఉంది
- శ్రీకర సత్య సేవ వ్యవస్థాపకులు నూతి శ్రీకర శర్మ



నవతెలంగాణ-వర్గల్

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ప్రముఖ న్యాయవాది, శ్రీకర సత్య సేవా సహకార సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు నూతి శ్రీకర శర్మ పేర్కొన్నారు. ఆదివారం వర్గల్ మండల కేంద్రంలో పేద విద్యార్థులకు నోట్ బుక్స్, స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడంతో పాటు పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు నూక లింగమూర్తి గుప్తను సన్మానించిన అనంతరం ఆయన మాట్లాడారు. సమాజంలో గురువు పాత్ర ఎంతో విలువైనది, ఉన్నతమైనదని స్పష్టం చేశారు. ప్రపంచంలో మేధావులుగా పిలువబడే స్వామి వివేకానంద, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, రామకృష్ణ పరమహంస వంటి ప్రముఖులను తీర్చిదిద్దింది గురువులేనని తెలిపారు. అయితే సమాజ ప్రగతికి స్వలాభ లేకుండా ముందుకు సాగాలని, గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి సమాజానికి అందించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాలలో 22 ఏళ్లుగా విద్యార్థులను తీర్చిదిద్దిన గురువు లింగమూర్తి గుప్త భవిష్యత్తులో విద్యార్థులకు బంగారు బాట చూపాలని కోరారు. విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యనందిస్తే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని పేర్కొంటూ పలువురు ప్రముఖులను ఆయన ఉదహరించారు. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు లింగమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా గ్రామీణ విద్యార్థులకు సేవలందించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తుండగా, ఉపాధ్యాయ వృత్తి తనకు ఎంతో సంతృప్తి కలిగించిందని తెలిపారు. భవిష్యత్తులో పేద విద్యార్థులకు తన సంపూర్ణ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు మనిగండ్ల శ్రీనివాస్, షామీర్ పేట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కిష్టయ్య గుప్త, వర్గల్ మండల బిజెపి అధ్యక్షులు టేకులపల్లి బాల్రెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బిక్షపతి గుప్త పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-చేర్యాల

యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్టలో ఈ నెల 18 నుంచి 20 వరకు జరిగే దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు రామగల్ల నరేష్ కోరారు. ఈ సందర్భంగా చేర్యాల పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఆదివారం శిక్షణా తరగతులకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం నరేష్ మాట్లాడుతూ దేశంలో దళితుల పైన అనేక రకాల దాడులు పెరిగిపోయాయని, గత పది సంవత్సరాల నుంచి ఉత్తర ప్రదేశ్, బీహార్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ తోపాటు తెలంగాణలోని కొన్ని ప్రాంతాలలో దళితులపైన అవమానకరంగా వివక్షను కొనసాగిస్తున్నారని అన్నారు. ఈ వివక్ష పోవాలంటే దళితులంతా ఏకమై అంబేద్కర్ రాసిన రాజ్యాంగ రక్షణలో భాగంగా ఉద్యమించాల్సిందిగా కోరారు. దళితుల రక్షణ కోసం ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా వాటి అమలు సరిగా లేదన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని సంపూర్ణంగా అమలు చేసి 59 కులాల దళితులకు రిజర్వేషన్ పెంచాలని ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గూడెపు సుదర్శన్, రామగళ్ళ కిషోర్, కాటం శ్రీకాంత్, మల్లిగారి భూమయ్య, క్రాంతి కుమార్, గజ్జల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం





నవతెలంగాణ-వర్గల్

నాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2009-10 సం.లో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థిని విద్యార్థులు నాచారంలోని ఒక ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు అప్పటి అనుభవాలు, అనుభూతులు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయ బృందం రఘునాథ్, రాజ గోపాల్ రెడ్డి, ఖాజా మోహినుద్దీన్, పూర్ణ చంద్ర శేఖర్, ప్రశాంత్, మల్లికార్జున్, సాయి రామ్, కన్నా రెడ్డి, కవిత, స్రవంతి, కుమార్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-రాయపోల్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దౌల్తాబాద్ 1991-1992 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ దౌల్తాబాద్ మండల కేంద్రంలో పదవ తరగతి పూర్తయిన తర్వాత మళ్లీ 32 సంవత్సరాల తరువాత ఈ విధంగా కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. తాము ఇంత గొప్ప స్థాయికి రావడానికి మా గురువులే కారణమని తల్లి, తండ్రి తరువాత ఎవరైనా గురువులను గౌరవించాలన్నారు. త్రిమూర్తులు అంటే తల్లి, తండ్రి, గురువు అన్నారు. ఒక చిన్న అటెండర్ స్థాయి నుంచి ఐఏఎస్ దేశ అత్యున్నత పదవి అయిన ప్రధాని, రాష్ట్రపతి వరకు ఎవరైనా పాఠశాలకు వెళ్లకుండా గురువుల చేత విద్య బుద్దులు అభ్యసించకుండా సాధించలేమన్నారు. గురువులకు రుణపడి ఉంటామని వారిని ఎల్లవేళలా గుర్తించుకుంటామని తెలియజేశారు. అలాగే గురువులు మాట్లాడుతూ చాలా సంవత్సరాల తర్వాత మళ్లీ విద్యార్థులందరినీ కలుసుకోవడం చాలా సంతోషకరమన్నారు. ఉపాధ్యాయులకు విద్యార్థులు తమ కంటే ఉన్నత స్థాయికి ఎదిగితే దానికి మించిన గురుదక్షిణ లేదన్నారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో 1991-92 బ్యాచ్ ప్రధానోపాధ్యాయులు లింగారెడ్డి, ఉపాధ్యాయులు చారి, ఆది నర్సింలు, రాజు రెడ్డి, రామ్మూర్తి, రాంరెడ్డి, రంగరాజేశం, విద్యార్థులు గంప రవి, జక్కుల చంద్రం, సిద్ధ రాములు, ఆనందం, కృష్ణ, శ్యామ్ ప్రసాద్, తిరుమలాపూర్ వేణు, నర్రా నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ- గజ్వేల్

ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల గజ్వేల్ 2003-04 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం గజ్వేల్ పట్టణంలోని పిఎస్ఆర్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సమ్మేళనంలో ఉపాధ్యాయులు కోదండరాములు శర్మ, సంజీవరెడ్డి, జయపాల్ రెడ్డి, విద్యార్థులు వారి అనుభవాలు పంచుకున్నారు. ఉపాధ్యాయులను శాలువలు, మెమోంటోలతో పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులు మాట్లాడుతూ 20 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థులతో కలుసుకోని అప్పటి పాఠశాల జ్ఞాపకాలు గుర్తు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. పదో తరగతి పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు ఒకే చోటకు అందరం కలుసుకోవడం మంచి అనుభూతిని ఇస్తుందన్నారు. సిద్దిపేట జిల్లాలో మంచి ఫలితాలను పేరు ఉండేది. పోటీతో ఇక్కడ చదువుకోవడానికి వచ్చేవారన్నారు. ఉన్నత స్థాయిలో ఉన్న తమ విద్యార్థులను చూసి చాలా గర్వంగా ఉందని ఉపాధ్యాయులు తెలిపారు. తమను గుర్తుంచుకొని మళ్ళీ ఈ కార్యక్రమానికి పిలిచినందుకు ఉపాధ్యాయులు ఆనందంగా ఉందని, భవిష్యత్‌లో కూడా విద్యార్థినీ విద్యార్థులు ఇలాగే ఐక్యమత్యంగా ఉండి తమ స్నేహం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తెలుగు పండిత్ కోదండరాములు, సంజీవరెడ్డి, వెంకట రమణ శర్మ జయపాల్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నాయి బ్రాహ్మణులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించాలి



నవతెలంగాణ-మిరుదొడ్డి

కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్న నాయి బ్రాహ్మణులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించి ఆదుకోవాలని నాయి బ్రాహ్మణ సంఘం నాయకుడు ఉపేందర్ అన్నారు. మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రేక్కాడితేగాని డొక్కాడని నాయి బ్రాహ్మణులు కులవృత్తిని నమ్ముకుని జీవన కొనసాగిస్తుంటే వారి పరిస్థితి తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుందన్నారు. నాయి బ్రాహ్మణ వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న వారికి ప్రభుత్వం సబ్సిడీపై పరికరాలతో పాటు రుణాన్ని అందించి ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రతి గ్రామంలో నాయి బ్రాహ్మణులు ఎంతోమంది కుల వృత్తి సరి లేకపోవడంతో వలసలు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం వారికి ఉపాధి కల్పించాలని కోరారు.

కామన్ యోగా ప్రోటోకాల్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ



నవతెలంగాణ-సిద్దిపేట

అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 సన్నాహక భాగంగా కామన్ యోగ ప్రోటోకాల్ పై సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యాస మహర్షి యోగా సెంటర్‌లో వర్క్ షాప్ నిర్వహించారు. ప్రముఖ యోగా శిక్షకులు తోట సతీష్ కామన్ యోగా ప్రోటోకాల్ పై శిక్షణ ఇచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రతి పాఠశాలలో ఘనంగా నిర్వహించుకోవాలని జిల్లా అధ్యక్షులు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా సిద్దిపేటలో పలు పాఠశాలలో, వివిధ ప్రాంతాలలో యోగా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని అన్నారు. పిల్లల నుండి పెద్దల వరకు అందరూ పాల్గొనవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా అసోసియేషన్ సభ్యులు గంగాపురం శ్రీనివాస్, తోట సంధ్య, బస్వ రాజకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవ తెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని రేణుక మాత ఫంక్షన్ హాల్‌లో ఆదివారం 1998-99పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 సంవత్సరాల తర్వాత ఒకచోట కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్దన్ రెడ్డి, రాజిరెడ్డి, మహిపాల్ రెడ్డి, విద్యార్థులు సిద్ధరామరెడ్డి, చిరంజీవి గౌడ్, కొమ్మాట పరశరాములు, లక్ష్మీనారాయణ, ఆకుల మహేందర్, ప్రవీణ్ రెడ్డి, శివకుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నేడే ఇంటర్ ఇంగ్లీష్ ప్రాక్టికల్స్



- ప్రిన్సిపల్ శ్రీనివాసులు

నవతెలంగాణ -వెల్దుర్తి

ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు సప్లమెంటరీ పరీక్షలకు కొనసాగింపుగా 9 గంటల లోపు కళాశాలకు హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి ఇంగ్లీష్ ప్రాక్టికల్ ప్రారంభం కానుందన్నారు. గత వార్షిక పరీక్షల్లో ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ ప్రాక్టికల్స్‌లో అనుత్తీర్ణులైన విద్యార్థులు, హాజరు కాని విద్యార్థులు తమ కళాశాలలో తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. సోమవారం ఇంగ్లీష్ ప్రాక్టికల్ ఉంటుందన్నారు. 11వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పర్యావరణ విద్య, 12వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నైతికత, మానవ విలువలపై పరీక్షలు జరుగుతాయన్నారు. గతంలో రాయని వారు తప్పకుండా రాయాలని వారు తెలిపారు. రికార్డు పూర్తి చేసి ఎగ్జామ్‌కి రావాలని, ఉదయం 9:30 వరకు పరీక్ష కేంద్రానికి రావాలని, హాల్ టికెట్ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నవతెలంగాణ-చేగుంట

రోడ్డు ప్రమాదంలో 44వ జాతీయ రహదారి పై వ్యక్తి మృతి చెందిన సంఘటన చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామ శివారులో ఆదివారం ఘటన చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం అంతం పల్లి గ్రామానికి చెందిన పిట్ల కుమారస్వామి (28) మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండలం షమ్నాపూర్ గ్రామానికి చెందిన సమీప బంధువులైన నిజ్జని నిర్మల, నిజ్జని నర్సింలులను తన మోటార్ సైకిల్‌పై ఎక్కించుకొని పెద్ద శివునూర్ గ్రామం నుంచి చేగుంట మీదుగా రామాయంపేట వైపు వెళ్తుండగా రెడ్డిపల్లి గ్రామ శివారులో ఇండియన్ పెట్రోల్ పంప్ ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. హైదరాబాద్ వైపు నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టినందున మోటార్ సైకిల్‌పై ఉన్న ముగ్గురు రోడ్డుపై పడిపోగా మోటార్ సైకిల్ నడిపిన పిట్ల కుమారస్వామి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మరణించాడు, మిగతా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరిని 108 అంబులెన్స్‌లో తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మరణించిన కుమారస్వామి మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వాసుపత్రి మార్చురికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్సై బాలరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సెలవు దినాలలో అక్రమంగా మట్టి తరలింపు



నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధిలో ఆదివారాలు, ప్రభుత్వ కార్యాలయాల సెలవు దినాలలో అక్రమ మట్టి దందా జోరుగా సాగుతోంది. అక్రమ మట్టి దందాను నివారించడానికి ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా వాల్టా లాంటి చట్టాలు తీసుకువస్తున్నా, మట్టి వ్యాపారులు కొత్త దారులలో అక్రమార్జన చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. మట్టి తవ్వకాలు చేయాలంటే ముందస్తుగా మైనింగ్ శాఖకు చలానా రూపంలో రుసుము కట్టి అనుమతులు పొందాల్సి ఉంటుంది. కానీ, ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇష్టా రీతిలో అక్రమ మట్టి తవ్వకాలు చేస్తూ విలువైన మట్టి సంపదను తరలించుకు పోతున్నారు. సెలవు దినాలలో సంబంధిత కార్యాలయాలలో ఎవరూ ఉండరని, తమను ఎవరూ పట్టించుకోరన్న భావనతో జోరుగా మట్టిని తరలిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు ఇస్తూ జారుకుంటున్నారు. ఎవరి అండ దండలతో వీరి ఆటలు సాగుతున్నాయోనని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా చొరవ చూపాలని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మట్టి తరలింపును అడ్డుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పెద్ద తాండాలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ ప్రథమ వర్ధంతి



నవతెలంగాణ-నార్సింగి

మాజీ పీఏసీఎస్ చైర్మన్, నార్సింగి మండల బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కే.శే తౌర్యా నాయక్, ఆయన చిన్న కుమారుడు గత సంవత్సరం జులై 22న రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆదివారం పెద్ద తాండాలో వారి నివాసం వద్ద ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ బానాపురం కృష్ణా రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు పలువురితో కలిసి ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. తౌర్యా నాయక్‌తో తమకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. తౌర్యా నిజమైన ప్రజా నాయకుడని, అందరితో కలుపుగోలుగా ఉండేవారన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారన్నారు. నాయక్ కుటుంబానికి తమ ప్రగాఢ సహానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద తాండా తాజా మాజీ సర్పంచ్ చత్రియా నాయక్, పెద్ద తాండా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాషా నాయక్, మాజీ వైస్ ఎంపీటీసీ ఆకుల మల్లేశం గౌడ్, రైతు కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, నర్సంపల్లి గ్రామ తాజా మాజీ వార్డు సభ్యుడు నాగరాజు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి భూపతి రాజు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అల్లాహ్ దయతో ప్రజలందరూ బాగుండాలి

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి.



నవతెలంగాణ-రాయపోల్

అల్లాహ్ దయతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆనందంగా జీవించాలని ఇమ్రాన్ బాబా గుట్ట ఉత్సవంలో మొక్కులు తీర్చుకోవడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం దౌల్తాబాద్ మండలం దొమ్మట గ్రామంలో ఇమ్రాన్ బాబా గుట్ట ఉత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇమ్రాన్ బాబా ఉత్సవాలను మైనారిటీ సోదరులు కలిసి మెలిసి ఘనంగా నిర్వహిస్తున్నారు. దుబ్బాక నియోజకవర్గంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కులమతాల భేదం లేకుండా అందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించడం జరుగుతుందన్నారు. మైనారిటీల అభివృద్ధి కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తొగుట ఎంపీపీ గాంధారి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గాజులపల్లి మల్లారెడ్డి, భూపాల్ రెడ్డి, విజయపాల్ రెడ్డి, సాయికుమార్, తలారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి పదవి వరించడంపై హర్షం



నవతెలంగాణ-బెజ్జంకి

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కు కేంద్ర మంత్రి పదవి వరించడంపై మండల బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఢిల్లీలో కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన ఎంపీ బండి సంజయ్, కిషన్ రెడ్డిని బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. కరీంనగర్ ఎంపీగా రెండవ సారి ఎన్నికై కేంద్ర మంత్రి పదవి వరించడం అనందనీయమని మహిపాల్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు.

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కేంద్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం మండల బీజేపీ శ్రేణులు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం చౌరస్తా వద్ద టపాసుల కాల్చి సంబురాలు చేసుకున్నారు.

ప్రభుత్వాలు మారినా సమస్యలు తీరలేదు

- కనీస సౌకర్యాలు కరువు.
- ఎన్నికలప్పుడే కనిపించే రాజకీయ నాయకులు
- సమస్యలు పరిష్కరించాలని అనాజీ పూర్ దళితులు డిమాండ్



నవ తెలంగాణ-రాయపోల్

ప్రభుత్వాలు మారినా రాజకీయ నాయకులు మారిన దళిత వాడలలో సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. ఏండ్లు గడుస్తున్నా పాలకులు మారుతున్న వారి గోసను విన్నవారు లేరు. దళితవాడలలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం. మురికి కాలువలు లేక ఇబ్బందులు. చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారిన కాలనీ..పట్టించుకోని అధికారులు, నాయకులు.మురికి కాలువలు లేకపోవడం. చిన్నపాటి వర్షానికి కాలనీ చిత్తడిగా మారిపోవడం. ఇండ్లల్లోకి నీళ్ల రావడంతో పాటు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రాయపోల్ మండలంలోని అనాజిపూర్ గ్రామంలోని ఆరో వార్డులో మురికాలువలు నిర్మించకపోవడంతో వర్షాలు కురిస్తే కాలనీలో ఉంటున్న ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం వీధి దీపాలు లేకపోవడంతో చీకట్లోనే మగ్గుతున్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా సమస్యలు పరిష్కారం కావడంలేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఎన్నికలు రాగానే నాయకులు వస్తున్నారు సమస్యలు చెప్తే ఎన్నికల కోడ్ ముగియగానే అన్ని సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇస్తున్నప్పటికీ తమ సమస్యలు పరిష్కారం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షాలు పడితే కాలనీ మొత్తం జలమయంగా మారి ఇండ్లలోకి నీరు వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆరవ వార్డులో నీరు చేరడంతో బయటకు వెళ్లాలంటే కాలనీవాసులు బురద నీటిలో నుంచే నడవాల్సిన పరిస్థితి. అసలే వర్షాకాలం కావడంతో దోమలు ఈగలు విస్తరించి సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. పిల్లలు ఆ బురద నీటిలోనే ఆటలాడుతున్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో కూడా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని, అధికారులు పత్తా లేకుండా పోయారని తమ కాలనీలో ఇబ్బంది ఉన్నా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. మురికి కాలువ నిర్మాణం చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని, ప్రభుత్వాలు మురికి కాలువలకు బదులు ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టాలని అవి కూడా మా కాలనీలో లేవన్నారు. పూర్తిస్థాయిలో సిసి రోడ్లు లేక రోడ్లు మొత్తం గుంతలమయంగా మారి ఆ గుంతలలో వర్షం నీరు నిలవడంతో రోడ్ల వెంబడి నడవడం ఎంతో ఇబ్బందికరంగా ఉందంటున్నారు. గతంలో పలుమార్లు అధికారులు నాయకులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని తమ కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమ కాలనీలో తక్షణమే, సీసీ రోడ్లు, వీధి దీపాలు, మురికి కాలువ నిర్మాణం చేపట్టి సమస్యలను పరిష్కరించాలని ఆరో వార్డు దళితులు పేర్కొంటున్నారు

దళితవాడలో అధ్వానంగా మారిన బతుకులు

వెంకని రాజవ్వ, అనాజీపూర్.



దళితులు అంటే కేవలం ఓట్లు వేసే ఓటర్లుగానే చూస్తున్నారని, ఎన్నికలు రాగానే అన్ని పార్టీల రాజకీయ నాయకులు ఓట్ల కోసం వస్తారని ఎన్నికలు ముగియగానే కనీసం మా కాలనీ వైపు తొంగి చూడరు. దళిత కాలనీలు అభివృద్ధికి మాత్రం ఆమడ దూరంలోనే మా కాలనీలు ఉన్నాయని, మా కాలనీలో మురికి కాలువలు అసలే లేవు. వర్షాలు కురిస్తే వర్షం నీరు ఇండ్లల్లో నుంచి వచ్చే నీళ్లు అన్ని రోడ్ల మీదకే వస్తాయి. దుర్గంధం వాసనతో రోడ్డు వెంట నడవాలంటే కష్టంగా ఉంటుంది. వర్షాకాలంలో అంటూ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి అధికారులు నాయకులు మా కాలనీలు సందర్శించి సమస్యలు పరిష్కరించాలి.



ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు

అనాజీపూర్ వెంకని సర్వయ్య



దళిత కాలనీలన్న, దళితులన్న చిన్న చూపో లేక నిర్లక్ష్యమో తెలియదు కానీ మా సమస్యలు మాత్రం ఏళ్ల తరబడి వేచి చూసినా పరిష్కారం కావడం లేదు. గతంలో ఎంతోమంది సర్పంచులు, ఎంపీటీసీలు మారుతున్నప్పటికీ వాళ్లందరికీ మా కాలనీ సమస్యలు విన్నవించినా ఇగ చేస్తాం అగ చేస్తాం అనుకుంటూ కాలయాపన చేశారు తప్ప, సమస్యలు పరిష్కరించడం లేదు. వర్షాకాలం చాలా ఇబ్బందులు అవుతున్నాయని, కాలనీలో వీధి దీపాలు,సరైన రోడ్లు, సిసి రోడ్లు లేక గుంతలు ఏర్పడి రోడ్లపై గడ్డి మొలుస్తున్నాయి. అధికారులకు చెప్పిన కూడా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇకనైనా దళిత కాలనీలో సమస్యలు పరిష్కరించాలి.

సమస్యలు పరిష్కారమయ్యేట్లు చూస్తాం

ఎంపీడీవో బాలయ్య



అనాజిపూర్ దళిత కాలనీలో నెలకొన్న సమస్యలు ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదని, గ్రామంలో దళిత కాలనీ ఆరో వార్డులో ఉన్న సమస్యలను పంచాయతీ కార్యదర్శికి చెప్పి పరిష్కారం అయ్యేటట్లు చూస్తామన్నారు. తక్షణంగా వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని అలాగే మురికి కాలువలు, సిసి రోడ్లు వెంటనే మంజూరు చేయడం వీలు కాదు కాబట్టి వాటికి నిధులు వచ్చినప్పుడు ఆరో వార్డులో నిర్మాణం చేపట్టడానికి ప్రాధాన్యత కల్పిస్తాం. అలాగే మురికి కాలువలకు బదులు ఇంకుడు గుంతలు నిర్మించడానికి ప్రజలకు అవగాహన కల్పించి నిర్మాణం చేపడతాము.

బస్టాండ్ నిర్మాణం పనులు ఈసారైనా పూర్తి అయ్యేనా!

- 15 సంవత్సరాల నుంచి కూడా నేటికీ అభివృద్ధికి నోచుకోని బస్టాండ్ నిర్మాణం పనులు
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు
- మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రయాణికులు



నవతెలంగాణ-మిరుదొడ్డి

మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం పనులు గత 15 సంవత్సరాలు గడుస్తున్నా ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. బస్టాండ్ నిర్మాణం పనులు అసంపూర్తిగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలో బస్టాండ్‌లోకి ప్రయాణికులు వెళ్లకుండా నిరుపయోగంగా ఉన్న వాహనాలకు అడ్డాగా మారింది. ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఈ నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఎన్నిసార్లు తెలిపిన పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుంది. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో బస్టాండ్ నిర్మాణం పనులు పూర్తికాలేదు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఇప్పటికైనా బస్టాండ్ నిర్మాణం పనులు పూర్తవుతుందా అని ఎదురు చూస్తున్నారు. మండల కేంద్రంలో ఉన్న బస్టాండ్‌ను ప్రజాప్రతినిధులు అధికారులు నిర్లక్ష్యంతో పనులు జరగక నిరుపయోగంగా మారింది. దీంతో నిత్యం ఏదో ఒక పనిమీద మండల కేంద్రానికి వచ్చిన చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని లింగుపల్లి, మిరుదొడ్డి ,చెప్యాలా బొంపల్లి తో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు ప్రయాణికులు బస్టాండ్ సరిగా లేకపోవడంతో వర్షానికి, ఎండకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మండల కేంద్రంలో ఇలాంటి పరిస్థితి నెలకొంటే గ్రామాల్లో ఎలా ఉంటుందోనని ప్రయాణికులు వాపోతున్నారు. మండల కేంద్రంలో బస్టాండ్ ఆవరణలో కనీసం మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. ఈ విషయం ఉన్నతాధికారులు , పంచాయతీ కార్యదర్శులకు తెలిపినా వారు పట్టించుకోవడం లేదు.

ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది అవుతుంది .

ఆకుల మల్లేశం, ఆటో డ్రైవర్



మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం10 సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉండడంతో ఇబ్బందులకు గురవుతున్నాం .రోజు విద్యార్థులు మహిళలు ప్రయాణికులు రోడ్డుపై నిలబడి అవస్థలు పడుతున్నారు. కనీసం ఇక్కడ మహిళలకు విద్యార్థులకు మూత్రశాలలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఎంపీడీవోలకు తెలిపినా వారు పట్టించుకోవడం లేదు.

బస్టాండ్‌లో పూర్తిగా నీళ్ళు నిండిపోయాయి

పిట్ల రాములు, మిరుదొడ్డి గ్రామస్తుడు



మండల కేంద్రంలో ఉన్న బస్టాండ్‌లో పైపు లీక్ కావడంతో గత నెల రోజులుగా పూర్తిగా నీళ్లతో నిండిపోయింది. ఇక్కడ గుంతలను పూడ్చడం లేదు. బస్టాండ్ ఆవరణలో పూర్తిగా బురదమయం కావడంతో దోమలు ఎక్కువై, చుట్టుపక్కల ఉన్న వారు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామపంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదు ఉన్నతాధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

ఎంపీడీవో గణేష్ రెడ్డి

బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలు తమ దృష్టికి వచ్చింది. సమస్యలు ఉన్న మాట వాస్తవమే. త్వరలో ఆ మురికి గుంతను పూడ్చివేస్తాము. పంచాయతీ సిబ్బందికి తెలపడం జరిగింది. వెంటనే ఈ సమస్యను పరిష్కారం చేస్తాం.



కార్యకర్తలు అధైర్య పడవద్దు అండగా ఉంటాం



నవతెలంగాణ-రాయపోల్

బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎవరు కూడా అధైర్య పడవద్దు, ఆపద కాలంలో ప్రతి కుటుంబానికి అండగా ఉండి కాపాడుకుంటామని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం బాధిత కార్యకర్త కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దౌల్తాబాద్ మండలం తిరుమలపూర్ గ్రామంలో ఇటీవల బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త యాకటి కిష్టయ్య మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. అలాగే మాజీ సర్పంచ్ యాదవ్ రెడ్డి మాతృమూర్తి రాజవ్వ మృతి చెందగా, వారి కుటుంబాన్ని కూడా పరామర్శించి మనోధైర్యంగా ఉండాలని తెలియజశారు. బ్యాడ్మింటన్ ఆడుతూ గుండెపోటుతో మృతి చెందిన యువకుడు పడాల శ్రావణ్ కుమార్ కుటుంబాన్ని పరామర్శించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకుడు శ్రావణ్ అర్ధాంతరంగా మరణించడం ఆ కుటుంబానికి తీరని లోటన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని అధైర్య పడవద్దని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎల్ చైర్మన్ వెంకటరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రహీముద్దీన్, దుబ్బాక నియోజకవర్గ బీసీ సమన్వయకర్త రణం శ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు బండారు దేవేందర్, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం నాగరాజు, తాజా మాజీ సర్పంచ్ గడ్డమీద భాగ్య ఎల్లం, గ్రామ కమిటీ అధ్యక్షులు రమేష్ గౌడ్, నాయకులు వెంకటయ్య, సత్తయ్య,రాజు,స్వామి, సత్తయ్య రమేష్, నర్సింలు, రాజనర్సు, కన్నా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను విమర్శిస్తే సహించేది లేదు

కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు చెప్యాల శ్రీనివాస్
పొన్నంపై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అనుచిత వ్యాఖ్యల ఖండన
పొన్నంకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్



నవతెలంగాణ-బెజ్జంకి

రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాజకీయంగా, వ్యక్తిగతంగా మచ్చలేని నాయకుడని అయనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఇష్టారీతిన విమర్శిస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు చెప్యాల శ్రీనివాస్ గౌడ్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని హెచ్చరించారు. మంత్రి పొన్నంపై ఎమ్మెల్యే కౌశిక్ అనుచిత వ్యాఖ్యలను చెప్యాల శ్రీనివాస్ అదివారం ఖండించారు. కాంగ్రెస్ హయాంలో ఉన్నప్పుడు టికెట్ కోసం పొన్నం కాళ్లు పట్టుకున్న సంగతి మర్చిపోయావా?అని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి శ్రీనివాస్ గుర్తు చేశారు. వీణవంక నుంచి హైదరాబాద్, వరంగల్ ఇసుక తరలించిన చరిత్ర ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిదన్నారు. ప్రజా సేవ లక్ష్యంగా నాటి నుంచి నేటి వరకు పనిచేస్తూ తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలను పణంగా పెట్టిన ఘనత మంత్రి పొన్నం ప్రభాకర్ దని శ్రీనివాస్ సూచించారు. ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గానికి అభివృద్ధి చేయకుండా గుండాగిరి చేస్తూ, అధికారులను బెదిరించే నీచ సంస్కృతికి తెరలేపిన నీచ చరిత్ర ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిదని.. ఇకనైనా బుద్ధి మార్చుకొని మంత్రి పొన్నంకు బహిరంగ క్షమాపణ చెప్పాలని శ్రీనివాస్ హెచ్చరించారు.

ప్రజల సందర్శనకు నోచుకోని పార్క్





నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన రెండు సంవత్సరాలకు గజ్వేల్ పట్టణంలో ఔషధల మొక్కల పార్కును ఏర్పాటు చేయాలని అప్పటి ముఖ్యమంత్రి, ప్రస్తుతం ఎమ్మెల్యే కేసీఆర్ సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించడంతో ఔషధ మొక్కల పార్కు.హెర్బల్ పార్కును నిర్మాణం చేపట్టారు. స్థానిక ఐఓసీ కార్యాలయం సమీపంలో ఎకరం స్థలంలో ఈ పార్కును నిర్మించారు. రూ 50 లక్షల వరకు ఖర్చు అయినట్లు తెలుస్తుంది. పట్టణ ప్రజలకు వివిధ రోగాల రుగ్మతలు ఉన్నవారికి ఔషధ మొక్కల పార్కు ఎంతో ఉపయోగపడుతుందని కేసీఆర్ అధికారులకు వివరించారు. గతంలో గజ్వేల్ స్పెషల్ అధికారిగా పనిచేసిన ప్రస్తుత దేవాదాయ శాఖ కార్యదర్శి హనుమంతరావు చేతుల మీదుగా ఈ పార్కును ఏర్పాటు చేశారు. అయితే ఆర్టికల్చర్ అధికారుల సమక్షంలో ఈ పార్కు ఉన్నట్లు మున్సిపల్ శాఖ అధికారులు గతంలో చెప్పారు. దాదాపు ఏడు సంవత్సరాలు గడుస్తున్నా ప్రజలకు పార్కులోకి ప్రవేశం లేదు. చాలామంది పార్కులో ఉదయం వాకింగ్ దారులు, వివిధ రోగా రుగ్మతలు ఉన్న వ్యక్తులు అందులో 45 నిమిషాల పాటు వాకింగ్ చేస్తే కొంత వ్యాధి నివారణ జరుగుతుందని అందరూ భావిస్తున్నారు. లక్షలు పెట్టి నిర్మించిన పార్కు వృధాగా ఉందన్నారు. మున్సిపల్ సిబ్బంది మాత్రమే అందులో రాలిన ఆకులను రోజు శుభ్రం చేస్తూ పెరిగిన చెట్లను తొలగించే పనులు మాత్రమే చేస్తున్నారు. నిత్యం వందలాది మంది వివిధ వ్యాధులతో సమీపంలో ఉన్న గ్రౌండ్లో వాకింగ్ చేస్తున్నారు. హెర్బల్ పార్కు ప్రారంభం అయితే పార్కులోకి సందర్శించే అవకాశం ఉంది. ఔషధ మొక్కల ద్వారా ప్రజలు కొంతసేపు అలసట తీర్చుకునే అవకాశం ఉంటుంది. హార్టికల్చర్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారులు తమకు ఇంకా ఆర్టికల్చర్ అధికారులు అప్పగించలేదని చెప్తున్నారు. అయితే మున్సిపల్ సిబ్బంది మాత్రం పార్కును రోజులలో శుభ్రం చేస్తున్నారు. మున్సిపల్ శాఖకు అప్పగించలేదని చెప్తున్నా అధికారులు ఎందుకు శుభ్రం చేయిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మరో విషయం ఏమిటంటే ఆ పార్కులో ప్రజలకు ప్రవేశం లేకుండా పోయింది. దీంతో నాగు పాములు ఇతర విష పురుగులు, విష కీటకాలు అందులో ఉన్నట్లు స్థానికులు సమీపంలో ఉన్న హౌసింగ్ బోర్డ్‌లో నివసిస్తున్న ప్రజలు అధికార దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రజలు తిరిగినట్లయితే విష పురుగులు కీటకాలు దరిదాపుల్లో ఉండవని స్థానిక ప్రజలు అంటున్నారు. అదేవిధంగా పార్కులో బతుకమ్మ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. హెర్బల్ పార్కు ప్రధాన గేటుకు ఎదురుగానే బతుకమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో మంచి సుందరీ కరణంగా కనిపిస్తుంది. ఇప్పటికైనా హార్టికల్చర్ అధికారులు, మున్సిపల్ అధికారులు పట్టించుకోని హెర్బల్ పార్కులోకి ప్రజల సందర్శనకు అనుమతి ఇవ్వాలని కోరుతున్నారు.

త్వరలోనే అందుబాటులోకి తెస్తాం

మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య



గజ్వేల్ పట్టణంలో ఉన్న హెర్బల్ పార్కును ప్రజలకు అందుబాటులోకి త్వరలోనే తీసుకొస్తాం. మున్సిపల్ పాలకవర్గంతో చర్చిస్తున్నాం. వచ్చే సమావేశంలో హెర్బల్ పార్కు మరమ్మతులపై నిర్ణయం తీసుకుంటాం. చిన్న చిన్న పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూస్తాం.